క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు (రెండో ఏడాది) మే 7 నుంచి వారం రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు జగదీష్ బాబు, చామర్తి కృష్ణమాచార్యులు తెలిపారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేసీహెచ్‌బీ గుప్తకు శుక్రవారం ఆహ్వానపత్రికలు అందించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం ప్రతినిధులు

ఆమదాలవలస: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఆమదాలవలస తాలూకా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని సంఘం అధ్యక్షుడు బి.వి.ఎస్.మూర్తి అన్నారు. సంఘం కార్యదర్శి బలివాడ శంకరరావు, సాధికార కన్వీనర్ సదాశివుని వెంకటేశ్వరరావు, సంఘం సభ్యులు ప్రహ్లాదరావు, కె.యోగేశ్వరరావు, కె.రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు



ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ స్టాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు సేవలు అందజేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని తురకపేట వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ల రిక్వెస్ట్ స్టాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా తురకపేట ప్రాంత ప్రజలు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ సేవల కోసం ఎదురు చూస్తున్నారు. వారి చిరకాల కోరిక మేరకు ఎక్స్‌ప్రెస్ బస్సు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ మండలంలోని సిరుసువాడలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలతో కూడిన విద్య అందివ్వడం జరుగుతుందన్నారు. సర్పంచ్ పోలినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు దివ్య, పాఠశాల చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: మండలంలోని పాతపానుటూరు ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలతో కూడిన విద్యను అందివ్వడం జరుగుతుందని హెచ్‌ఎం జి.కృష్ణారావు, జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదమ తిరమలరావు అన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో మొదటి స్థానంలో నిలిచిన, ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన, పలు కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ చామంతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం

పాతపట్నం: గత 30 ఏళ్ల నుంచి రాష్ట్రంలో సుదీర్ఘ పోరాటం చేయడం వల్ల ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా విభజించి, ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు న్యాయం జరిగిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు అన్నారు. స్థానిక అంతరాబ కూడలిలో సీమ రామకృష్ణ, ఎం.బాబూరావు, జి.అప్పారావు, ఎస్.అనందరావు తదితరులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల ఉప కులాలకు న్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో చింతల ఉమ, రామకృష్ణ, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దళారులే దిక్కు..!

- రబీ వరి ధాన్యానికి మద్దతు ధర లేకపోవడంతో రైతు దిగాలు..
- కనీసం పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పండిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అన్నదాత అగచాట్లు
- గత ప్రభుత్వ కాలంలో బస్తా రూ.2 వేలకు పైనే, నేడు రూ.1,730



కంబకాయ కూడలి వద్ద సర్వీసు రోడ్డుపై అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం



సత్యవరం కూడలి వద్ద బస్తాల్లో నిల్ల ఉన్న రబీ ధాన్యం

నరసన్నపేట: రైతులకు అడుగడుగునా కష్టనష్టాలు తప్పడం లేదు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. గిట్టుబాటు ధరలు మాత్రం లేవు. ఎకరం వరి పంట సాగు చేయాలంటే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. నాట్లు నుంచి పంట నూర్పిడి వరకు.. చీడపీడలను నివారిస్తూ తీరా పంట చేతికి వచ్చాక మార్కెట్లో ధరలు నిరాశాజనకంగా ఉంటున్నాయి. రబీ వరి పండించే రైతులు కనీస మద్దతు ధరను కూడా నోచుకోలేకపోతున్నారు. ఖరీఫ్‌లో పండే సన్న రకాలకే ధరలు అంతగా లేవు. పరిస్థితులు మారవా అని ఆశపడి రబీలో సుగర్ లెస్ సాంబా పంటను అధిక సంఖ్యలో వేశారు. ఆశించిన ధరలేక నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులే రైతును దోచుకుంటున్నారు. వారు చెప్పిన ధరకే విక్రయాలు చేయాల్సి వస్తోంది.

పెరిగిన ఖర్చులు..

విత్తనాలు మొదలుకొని నూర్పుడి వరకూ ఖర్చులు పెరిగాయి. వ్యవసాయ కూలీలు, రసాయనిక ఎరువులు, తెగుళ్ల నివారణ మందులు, సేద్యం ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కూలీలు సమయానికి లభించక రైతుకు ఇబ్బందులు తప్పడం లేదు. నూర్పుడి యంత్రాలకు ధరలు పెంచారు. నూర్పిడి చేసిన ధాన్యం ఆరబెట్టడానికి మరింత ఖర్చు అవుతుంది. గత రబీ కంటే ఈ ఏడాది రూ.5 వేల నుంచి రూ.6 వేలు అధికంగా ఖర్చులు పెరిగాయి.

గత ప్రభుత్వంలో బస్తా రూ.2 వేలు..

గత ప్రభుత్వ కాలంలో రబీలో వరి పండించే రైతులు అధిక లాభాలు చవిచూశారు. కళ్లాల వద్దకే దళారులు వెళ్లి 80 కేజీల బస్తాను రూ.2 వేల నుంచి 2,200 వరకు కొనుగోలు చేసేవారు. సుగర్‌లెస్ సాంబా బియ్యం ఎగుమతులు అధికంగా ఉండటంతో ధర బాగా పలికింది. ప్రస్తుతం రూ.1,600 నుంచి రూ.1750 వరకు అరువు పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. బస్తాకు సరాసరిన మూడు వందల వరకు ధర తగ్గడంతో రైతులు నష్ట పోతున్నారు. ఎకరాకు 30 బస్తాల వరకే దిగుబడి వచ్చింది. సుమారుగా రూ.9 వేలు నష్టపోయారు. ఖరీఫ్‌లో పండిన ధాన్యమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేకపోయింది. ఇప్పటికీ రైసు మిల్లుల్లో రైతుల ధాన్యం బస్తాలు ఉన్నాయి. సంక్రాంతి తరువాత కొనుగోలు కేంద్రాలు మూతపడ్డాయి. దీని ప్రభావం రబీ వరి పంటపై చూపింది. ఒకవైపు ప్రభుత్వం రైతులకు భరోసా పేరున ఆదుకోకపోగా.. ఈ విధంగా పండిన పంటకు సరైన ధర కల్పించకపోవడంతో మరింతగా నష్ట పరిచింది.

నరసన్నపేట నియోజకవర్గంలో రబీ వరి సాగు (ఎకరాల్లో) వివరాలు..

మండలం	వరి సాగు
నరసన్నపేట	844
జలుమూరు	1,752
పోలాకి	596
సారవకోట	1,499

ధర బాగా తగ్గింది



ఎన్నో ఆశలతో రబీలో వరి వేశాం.. పంట బాగా వచ్చింది. ధరే బాగా పడిపోయింది. గతంలో డబ్బులు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసేవారు. ఇప్పుడు అరువు. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలీదు. గత ప్రభుత్వ కాలంలో 80 కేజీల బస్తా రూ.2,200 వరకు అమ్ముడైంది. ఇప్పుడు రూ.1,750లకు విక్రయించాను. బస్తాకు రూ.5 వరకు తగ్గింది. ఇదంతా దళారులకు మేలు చేసింది.

– పోలాకి నర్సింహమూర్తి, రైతు, బడ్డవానిపేట, నరసన్నపేట మండలం

గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు



గత రబీలో మంచి ఆదాయం వచ్చింది. పండిన ధాన్యం వెంటనే అమ్ముడయ్యాయి. ఈ ఏడాది బస్తా రూ.1,730లకు అడుగుతున్నారు. ఇవ్వడానికి ఇష్టం లేక ధర వస్తుందనే ఆశతో నిల్వ చేశాను. కొద్ది రోజులు చూస్తాను. ఖరీఫ్‌లోనే సన్న ధాన్యం రైతుల వద్ద ఉండిపోయాయి. ఈ ప్రభావం రబీ పంటపై పడింది. గతంలో ఎప్పుడూ రబీ వరికి ఈ పరిస్థితి లేదు. కనీస మద్దతు ధర వచ్చినా బాగుండేది.

– నేతింటి రాజేశ్వరరావు, భవానీపురం, నరసన్నపేట

షట్టర్లు ఇలా.. సాగునీరు ఎలా?



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని తురకపేట సమీపంలో గల పనిచేయని షట్టర్. మండలంలోని వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, పిల్ల కాలువలు, యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ షట్టర్లు సక్రమంగా పనిచేయడం లేదు. గోనెపాడు నుంచి రొట్టవలస వరకు ఉన్న ఆయకట్టుకు రానున్న ఖరీఫ్‌లో సాగునీరందించే ఓపెన్ హెడ్ ఛానల్ సక్రమంగా లేకపోవడంతో శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు స్పందించి షట్టర్లను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

పొంచి ఉన్న ప్రమాదం..



నరసన్నపేట మండలంలోని జమ్ము కూడలి వద్ద మార్కెట్ కమిటీ వైపు సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న కల్వర్టు వద్ద గొయ్యి ఏర్పడింది. టెక్కలి వైపు నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు ఈ సర్వీసు రోడ్డులో నరసన్నపేట టౌన్‌లోకి వస్తుంటాయి. వాహనదారులు ఆదమరిస్తే గొయ్యి వద్ద ప్రమాదం పొంచి ఉంది. జాతీయ రహదారుల అధికారులు వెంటనే స్పందించి గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు. – నరసన్నపేట

వితరణ



సోంపేట మండలంలోని బారువాలో గల చిలుకూరి బాలాజీ గోశాలలో ఆవుల సంరక్షణకు నరసన్నపేట పట్టణానికి చెందిన ఈశ్వర్ చారిటిబుల్ ట్రస్టు, విశ్వచైతన్య యోగా శిబిరం తరఫున రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు గోశాల నిర్వహకురాలు ఆదిలక్ష్మికి ఈ మొత్తాన్ని అందించారు. ఈ గోశాలలో గోవుల పెంపకాన్ని ఆదిలక్ష్మి స్వయంగా చేపడుతున్నారని, తమవంతు సహాయంగా ఈ మొత్తం అందించామని ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మర్పు విజయ్ తెలిపారు. – నరసన్నపేట

మార్కెట్‌ను పునరుద్ధరించాలని వినతి



సర్పంచ్, ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌ను పునరుద్ధరించాలని, బజారుకు పూర్వవైభవం తీసుకురావాలని పంచాయతీ పాలకవర్గానికి, అధికారులకు బజారు వీధికి చెందిన వర్తకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓ ద్రాక్షాయినికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్‌ను శాశ్వత పద్ధతిలో నిర్మించారన్నారు. నిర్మాణంలో లోపాల వలన భవనాలు వినియోగంలోనికి రాలేదన్నారు. కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేసి.. పట్టణంలో పలుచోట్ల ఉన్న కూరగాయల దుకాణాలన్నీ ఒకచోటకు తీసుకురావాలని కోరారు. రాజుల చెరువును అభివృద్ధి చేయాలని విన్నవించారు. వ్యాపారులు వైశ్వరాజు కేశవరాజు, బోయిన బాలకృష్ణ, జామి వెంకటరావు, పాట్నూరు రమేష్, పి.పృథ్వీ పాల్గొన్నారు.

గోవుల మృతిపై విచారణ చేపట్టాలి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఘోర అపచారాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో గల గోశాలలో వందలాది గోవులు మృతి చెందాయన్నారు. మృతి చెందిన గోవులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లో పవిత్ర పుణ్యక్షేత్రంలో ఏదో ఒక సంఘటనతో తిరుమల పవిత్రతను టీటీడీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు రాజకీయ సమస్యగా చేసి భక్తులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. వందకు పైగా గోవులు చనిపోయినా.. సీఎం చంద్రబాబు, టీటీడీ ఈఓ ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. గోవులు ఎందుకు మృతి చెందాయో కూడా తెలియజేయకపోవడం శోచనీయమన్నారు. గోవుల మృతిపై భక్తులు కలత చెందుతున్నారన్నారు. జగనన్న పాలనలో గోశాలకు జాతీయ స్థాయిలో ఖ్యాతి ఉండేదన్నారు. అప్పట్లో గో సంరక్షణశాలలో గోవులను సురక్షితంగా చూసుకోనేవారన్నారు.

పాతపట్నంలో చిరుజల్లులు



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

పాతపట్నం: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి మధ్యాహ్నం మబ్బులు వేశాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది. పాతపట్నం, కొరసవాడ, గంగువాడ, తెంబూరు పరిసర ప్రాంతాలలో చిరుజల్లులు కురిశాయి.

రోడ్డుపైనే నిర్మాణం..!

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై నిర్మిస్తున్న గోడ

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలో రోజురోజుకీ ఆక్రమణల పర్వం తీవ్రస్థాయికి చేరుకుంటోంది. గృహ నిర్మాణదారులు రోడ్డుపైనే అడ్డంగా గోడలు నిర్మిస్తున్నా.. మున్సిపల్ అధికారులు అటువైపు చూడటం లేదు. మున్సిపల్ ఆఫీస్ రోడ్డు ఎదురుగా ఓ ఇంటికి ఆనించి గోడ నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో అక్కడ నిర్మాణం చేపట్టినప్పుడు స్థానికులు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణానికి వారు కట్టే గోడ అడ్డొస్తుందని వివరించడంతో.. అప్పట్లో నిర్మాణాన్ని నిలిపివేశారు. ఇటీవల ఓ వ్యక్తి ఆ ఇంటిని కొనుగోలు చేశారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల అండతో రోడ్డుకు ఆనుకుని నిలువెత్తు గోడ నిర్మాణం చేపట్టారు.

అధికార పార్టీ నాయకుల అండతోనే..

అధికార పార్టీ నాయకుల అండతో పట్టణంలో రోజురోజుకూ ఫుట్ పాత్‌లు, చివరకు రహదారులను కూడా ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం కనీస చర్యలు చేపట్టడం లేదు. పత్రికల్లో వచ్చిన కథనాలకు నోటీసులు జారీ చేశామంటూ వివరణ ఇస్తున్నారు. అక్రమణదారులకు ఇచ్చిన నోటీసులకు తగిన వివరణ రాక ముందే.. అధికార పార్టీ కార్యాలయం నుంచి ఫోన్‌లు వస్తున్నాయని మదనపడుతున్నారు. తమకు ఎందుకులే అంటూ మామూళ్లు అందుకొని కిమ్మనడం లేదు. మామూళ్లు వసూలు చేస్తున్నంత వరకు.. అక్రమార్కులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తుంటారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలకు కొంతమంది స్థానిక నాయకుల అండదండలు పూర్తిగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే రవికుమార్ పలు సమావేశాల్లో రహదారులు విస్తారంగా ఉండాలని, వాటిని సిమెంట్ దారులుగా నిర్మించేందుకు తగిన నిధులు సమకూరుస్తామని బహిరంగంగా చెబుతున్నప్పటికీ.. లోలోపల మాత్రం ఇటువంటి దురాక్రమణలు, అక్రమ నిర్మాణాలు నిత్యకృత్యం అవుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన రహదారులను ఆక్రమిస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ఆమదాలవలస: ధర్మారావు కోటర్స్‌లో బోధనలు చేస్తున్నరెవరెండ్ శామ్యూల్ అరుణ్ కుమార్, తదితరులు



పొందూరు: బోధనలు చేస్తున్న సీఎంసీ పాస్టర్ ప్రభుదాస్



పాతపట్నం: డబ్ల్యూఈ చర్చిలో బోధనలు చేస్తున్న ప్రసాదరావు

వాడవాడలా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీసస్ మరణం పొందిన రోజును పురస్కరించుకుని ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఏసు ప్రభువు ప్రాణత్యాగమే సర్వమానవాళికి శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం. శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసం ఆచరిస్తూ.. ప్రత్యేక ఆరాధనలు చేశారు. ఇరుగుపొరుగు వారిని ప్రేమించి, వారి తప్పులను మంచి మనసుతో క్షమించాలన్న జీసస్ బోధనలను అనుసరించాలని ఫాదర్‌లు సూచించారు. ఏసు మరణ వృత్తాంతాన్ని తెలిపే నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: సీతారాంపురం చర్చి వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న పాస్టర్ రవిబాబు



జలుమూరు: సీతారాంపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



ఆమదాలవలస: గ్యాస్ గొడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



ఆమదాలవలస: పెట్రోల్ బంక్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



కొత్తూరు: పెంట్రోల్ బంకు వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ బుచ్చోడు

ఆమదాలవలస/కొత్తూరు: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస ఫైర్ ఎస్ఐ కె.అప్పారావు, కొత్తూరు అగ్నిమాపక అధికారి బుచ్చోడు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆమదాలవలస పట్టణం, కొత్తూరు మండలం కేంద్రంలోని పెంట్రోల్ బంక్‌లు, గ్యాస్ గొడౌన్‌ల వద్ద సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి టీ 20 క్రికెట్ టోర్నమెంట్

ఆమదాలవలస: ఈ నెల 24వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీ 20 జిల్లా స్థాయి ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సీఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్ శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో ఉంటాయన్నారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి మ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. మే 25వ తేదీ ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. ఆంధ్ర, జిల్లా క్రికెట్ సంఘాల ఎంపైర్ల సమక్షంలో మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22వ తేదీన అందరి సమక్షంలో డ్రా తీస్తామన్నారు. ఇప్పటి వరకు 15 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. ఆసక్తి గల జట్లు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఎంట్రీ ఫీజు రూ.5,000 చెల్లించాలన్నారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, వ్యక్తిగత బహుమతులు కూడా అందజేస్తామన్నారు. క్రికెట్ జట్లు పేర్లు నమోదు చేసుకునేందుకు ఫోన్ నంబర్ 9848033159ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.